## క్లుప్తంగా

### విజేతగా హత్తిని జట్టు



విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో గత కొన్నిరోజులుగా దివంగత ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఫైనల్‌లో హత్తిని, కల్వాడ జట్లు తలపడ్డారు. ఇందులో హత్తిని జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా వసతులు కల్పించాలన్నారు. నాయకులు పడాల సురేశ్‌గౌడ్, మల్లేశ్, సంజీవ్, షేగం రాకేశ్, సతీశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం



శిబిరంలో పాల్గొన్న ఎస్సై గంగన్న తదితరులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ఎస్సై గంగన్న ప్రారంభించి మాట్లాడారు. ప్రాణదానం రక్తదానంతో సమానమన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వామి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సామాజిక సేవకులు మాడిశెట్టి ప్రశాంత్, సిద్దం కృపాల్, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వారసంత వేలం వాయిదా



వేలం నిర్వహిస్తున్న పాలకవర్గం, అధికారులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే వారసంత వేలం పాట వాయిదా వేస్తున్నట్లు ఈవో కృష్ణమూర్తి తెలిపారు. పంచాయతీలో ప్రతిఏటా నిర్వహించే వారసంతకు 2023–24 సంవత్సరానికి గాను వేలం నిర్వహించారు. నిర్దేశించిన ఆదాయం కన్నా తక్కువ రావడంతో వేలం వాయిదా వేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. పంచాయతీ సభ్యుల తీర్మానం మేరకు వేలం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.


### పౌరహక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లిలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరిత మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ హక్కులు, విధులు కల్పించిందని అన్నారు. ప్రతి పౌరుడు ఇతరుల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. హక్కులను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం నమోదయ్యే కేసుల గురించి తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టాల అమలు తీరుని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపాసీ సంజీవ్, ఎస్సై విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఆర్ఐ సురేశ్, ఏఈవో శ్రీవిద్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సైడ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎంపీపీ చునార్కర్ సువర్ణ

సిర్పూర్(టి): మండలంలోని డోర్‌పల్లి పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించనున్న సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ చునార్కర్ సువర్ణ శుక్రవారం ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకుడు ఉమాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కంటి వెలుగు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీవో గౌరీశంకర్ పరిశీలించారు. రోగులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ పద్మకిషన్, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రైవేటే దిక్కు..!



ఇతడి పేరు గడిల గోవర్ధన్. కాగజ్‌నగర్ మండలం బోడపల్లి స్వగ్రామం. దహెగాం మండలం ఇట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. దహెగాంలోని పరీక్ష కేంద్రానికి చేరుకోవాలంటే ప్రైవేటు వాహనంలో వెళ్లాలి. సుమారు 18 కి.మీ దూరం ఉంది. ఆర్టీసీ బస్సులు లేక ఆటోలో వెళ్లడానికి రోజు వంద రూపాయల ఖర్చుకానుంది. అధికారులు బస్సులు నడిపించేలా చర్యలు చేపట్టాలి.

- 'పది' పరీక్ష కేంద్రాలకు ఆటోల్లో ప్రయాణం
- 3 నుంచి పరీక్షలు ప్రారంభం
- ఆర్టీసీ సేవలు అంతంత మాత్రమే..
- దూరభారంతో విద్యార్థులకు ఇబ్బంది



కాలినడకన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

దహెగాం: మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు దూరంగా ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కాన్నాయి. దీంతో గ్రామాలకు ఆర్టీసీ సేవలు అంతంత మాత్రంగా ఉన్నాయి. దీంతో కేంద్రాలకు విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగా చేరుకోవాలంటే ఆర్టీసీ బస్సు సర్వీసులు లేవు. దీంతో ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితి. దీన్ని ఆసరా చేసుకుని యజమానులు అధిక చార్జీలు వసూలు చేసే అవకాశం ఉంది. ఆర్టీసీ బస్సులు లేక ఆటోలను ఎంగేజ్ చేసుకోవాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.

**రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు..**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ఉంటుంది. కేంద్రాలకు చేరుకోవాలంటే విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో సుమారు 15 నుంచి 18 కి.మీ దూరభారం ప్రయాణించాలి. ఇట్యాల సుమారు 16 కి.మీ, చిన రాస్పెల్లి విద్యార్థులు 12 కి.మీ, కల్వాడ, కుంచవెల్లి 10 కి.మీ, బీబ్రా 10 కి.మీ దూరం ఉంది.

| మండలంలో | | |
|---|---|---|
| | జెడ్పీ పాఠశాలలు: | 7 |
| | టెన్త్ విద్యార్థులు: | 268 |

**ఆర్టీసీ బస్సులు నిలిపివేత**

దహెగాం నుంచి కాగజ్‌గర్ మీదుగా ఆర్టీసీ సేవలు బంద్ చేశారు. కొన్ని నెలల క్రితం బస్సులు రాగా అవి నిలిపివేశారు. చినరాస్పెల్లి మీదుగా ఉదయం 7 గంటలకు ఆర్టీసీ బస్సు మండల కేంద్రానికి వస్తుంది. ఆ సమయంలో విద్యార్థులు పరీక్షకు బయల్దేరాలి. అదేవిధంగా కల్వాడ, కుంచవెల్లి విద్యార్థులకు మాత్రం ఉపయోగకరంగా లేదు. దీంతో వారు ప్రైవేటు వాహనాల్లోనే చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బీబ్రా, ఇట్యాలలోని పదో తరగతి విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో దహెగాంలోని పరీక్ష కేంద్రాలకు రావాలి. గత కొన్నేళ్ల నుంచి సైకిళ్లపై, ప్రైవేటు ఆటోల్లోనే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడిపించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఆటోల్లో ప్రయాణం**



కుంచవెల్లి నుంచి దహెగాంలోని పరీక్ష కేంద్రానికి చేరుకోవాలంటే 10 కి.మీ ప్రయాణం చేయాలి. ఆర్టీసీ బస్సు లేక ప్రైవేటు ఆటోల్లో ప్రయాణం చేసి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తారు. ఆర్టీసీ బస్సులు నడిపించి విద్యార్థులకు ఉచిత ప్రయాణం చేసే అవకాశం కల్పించాలి.

– నవీన్, పదో తరగతి విద్యార్థి, కుంచవెల్లి

## బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం



కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం కోర్టు ఆవరణలో ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ చంద్ర జైన్ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా బోనగిరి సతీశ్ బాబు, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి రవీందర్, ఉపాధ్యక్షుడిగా మునీర్ అహ్మద్, కార్యదర్శిగా మాహోర్కర్ శ్రీనివాస్, కోశాధికారిగా మంథెన చరణ్‌తేజ, స్పోర్ట్స్ కల్చరల్ ఇన్‌చార్జిగా సయ్యద్ ఒస్మాన్, లైబ్రరీ సెక్రెటరీగా ధీరజ్ భౌమిక, లేడీస్ రిప్రెజెంటేటివ్‌గా రాపర్తి గాయత్రి, సలహాదారులుగా టి.సురేశ్, ఎం.సురేశ్, పిసి జైన్, డి.వెంకటేశ్వర్లు, జగన్‌మోహన్ రావు, కె.రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ ఉమా మహేశ్వరిను కలిసి స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా 50 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్న ఆమ్దే శంభును న్యాయవాదులు శాలువాతో సత్కరించారు. న్యాయవాదులు, గుమస్తాలు శివచందు, వెంకటేశ్, ఆరిఫ్ పాల్గొన్నారు.

## గర్భిణులకు సామూహిక సీమంతం



సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో, సర్పంచ్

కెరమెరి: పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని గోయగాంలో అంగన్‌వాడీ కేంద్రంలో గోయగాం, మోడి సెక్టార్ల పరిధిలో గర్భిణులకు ఐసీడీఎస్ సీడీపీవో రెబ్కా, సర్పంచ్ రజిత శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. అన్నప్రాసనాలు, అక్షరాభ్యాసం కార్యక్రమాలు చేపట్టారు. చిన్నారుల బరువు కొలిచారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీలు ఉన్నారు.

**చిరుధాన్యాలపై అవగాహన**

వాంకిడి: మండలంలోని కనర్‌గాం గ్రామంలో పోషణ్ పక్వాడలో భాగంగా శుక్రవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో వంటకాలు చేసి ప్రదర్శించారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు పరీక్షప్యాడ్లు అందజేస్తున్న సీఐ



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రెబ్బెన: పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని రెబ్బెన సీఐ అల్లం నరేందర్ అన్నారు. శుక్రవారం దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, గంగాపూర్, నంబాల, తుంగెడ, తక్కళ్లపల్లి పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడారు. దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెబ్బెన ఎస్సై భూమేశ్, ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి శివాజీ, సభ్యులు వినోద్, అంజీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని హెచ్‌ఎం గావుడే హన్మంతు అన్నారు. మండలంలోని గుండాయిపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని తెలిపారు. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అంతకు ముందు విద్యార్థులకు పాఠశాల చైర్మన్ బి శంకర్, ఉప సర్పంచ్ లహంచు పటేల్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. నాయకులు జాడి దిలీప్, ఎ.సంతోష్, ఉపాధ్యాయులు శ్యాం సుందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యెలగతి సుచిత్ శుక్రవారం పరీక్ష సామగ్రి అందజేశారు. పెన్నులు, ప్యాడ్లు అందజేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు మండోకార్ వికాశ్, ఉపాధ్యక్షుడు బాపూజీ, సాయి, సంతోష్ తదితరులు ఉన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అనిల్ అన్న యువసైన్యం సేవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు చిత్తారి సాగర్, పెరుమండ్ల వెంకటేశంగౌడ్, బొల్లం శంకర్, పున్నం హరీశ్ తదితరులు ఉన్నారు.

## కలగానే క్రీడా మైదానం



జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానం

- క్రీడలపై ఆసక్తి ఉన్నా సాధనకు స్థలం కరువు
- పట్టించుకోని అధికారులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలో క్రీడా మైదానం కలగానే మిగిలిపోయింది. ఏళ్లుగా మైదానం కోసం ఎదురుచూస్తున్న క్రీడాకారులు, యువకులకు నిరాశే ఎదురవుతోంది. క్రీడలపై ఆసక్తి ఉండి సాధన చేయాలంటే మైదానం లేక ఇబ్బందులు పడుతున్నారు. వాకింగ్, రన్నింగ్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్ ఆడాలన్నా స్థలం లేకుండా పోయింది. క్రీడామైదానం ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని క్రీడాకారులు, పట్టణ ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. కాని పాఠశాల పని దినాల్లో ఆటలు ఆడాలన్నా, నిర్వహించాలన్నా కష్టమవుతోంది. ప్రతిఏటా దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లో పాఠశాల మైదానంలో మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి క్రికెట్ తదితర టోర్నమెంట్లు మండల యువకులు నిర్వహిస్తుంటారు. ఇటీవల పాఠశాల మైదానం పూర్తిగా వర్షపు నీటితో నిండింది. దీంతో పట్టణ ప్రజలతోపాటు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో క్రీడామైదానం మంజూరు చేసి క్రీడా వసతులు, సౌకర్యాలు కల్పించాలని క్రీడాకారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

**సెలవుల్లో క్రీడలు నిర్వహిస్తున్నాం**



జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఆటలు నిర్వహిస్తున్నాం. పాఠశాల సెలవు దినాల్లో క్రీడాపోటీలు జరుగుతున్నాయి. దూరప్రాంతాల నుంచి క్రీడాకారులు వస్తుంటారు. మైదానంలో పూర్తిగా వర్షపు నీరు నిలిచి ఉండటంతో క్రీడలు నిర్వహించలేదు.

– సురేష్‌కుమార్

**మైదానం లేక ఇబ్బందులు**



మండలకేంద్రంలో క్రీడా మైదానం లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడేందుకు యువకులు సాధన చేసుకునేందుకు క్రీడా మైదానం లేదు. పాఠశాల మైదానంలో క్రీడా సాధనలు చేస్తే విద్యార్థులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

– నులిగొండ రాజశేఖర్

## ఈరోజు

**నేడు అభివృద్ధి పనులపై సమీక్ష**

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం అన్ని గ్రామపంచాయతీల్లోని అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

**సర్వసభ్య సమావేశం**

దహెగాం: ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మినీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు.

**సమీక్షా సమావేశం**

కెరమెరి: ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. చేసిన పనులకు సంబంధించిన వివరాలతో హాజరుకావాలని సూచించారు.

**రేపు హనుమాన్ దీక్షాస్వాముల శోభాయాత్ర**

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం దీక్షా స్వాముల శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గొల్లగూడ రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని రైలు కిందపడి ఇందిరానగర్‌కు చెందిన గుండేటి రాజయ్య (70) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. గొల్లగూడ రైల్వేగేట్ సమీపంలో బల్లార్షా వైపు వెళ్లే అప్‌లైన్‌పై గుర్తు తెలియని రైలు కిందపడి రాజయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందింది. సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా, స్థానికుల తెలిపిన వివరాలు ఆధారంగా మృతుడు రెబ్బెన మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన గుండేటి రాజయ్యగా గుర్తించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**కూరగాయల ధరలు**

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాటా | రూ.20 |
| సిమ్లామిర్చి | 100 |
| దోసకాయ | 60 |
| చామగడ్డ | 80 |
| వంకాయ | 40 |
| బీరకాయ | 40 |
| కాకరకాయ | 50 |
| బెండకాయ | 120 |
| చిక్కుడు కాయ | 30 |

-ఆసిఫాబాద్‌అర్బన్

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న సీఆర్టీలు

తిర్యాణి: గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న సీఆర్టీలకు 12 నెలలపాటు వేతనం చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద సీఆర్టీలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. సీఆర్టీలు శంకర్, భీమేశ్, సుభాశ్, జలపతి, గోపి, శివ, కమలాకర్, విజయలక్ష్మి, సుమలత, శ్రీనివాస్ ఉన్నారు.

## ఆర్టీసీ కార్మికుడికి సన్మానం



దివాకర్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన దివాకర్ దంపతులను శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ గౌరవ అధ్యక్షుడు కలవేణి శంకర్ మాట్లాడారు. కార్మిక హక్కుల కోసం దివాకర్ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, కార్మికులు పాల్గొన్నారు.

**ఉద్యోగ విరమణ కార్మికురాలికి సన్మానం**

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయం కార్యాలయంలో జనరల్ మజ్దూర్‌గా పని చేసి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన కార్మికురాలు నక్క నర్సమ్మను అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, అధికారులు నర్సమ్మను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీజీఎం రామారావు, జీఎం పీఏ రామకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయం ప్రాంగణంలో శుక్రవారం రాత్రి సీతారామచంద్ర స్వామివారి పట్టాభిషేక కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఇంజినీర్ కొండు నరేశ్ దంపతులు, డ్రిల్ ఆపరేటర్ కనుకుంట్ల కిరణ్‌బాబు దంపతులు సీతా రాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్, ఆలయ కార్యదర్శి ప్రకాశ్‌రావు, కోశాధికారి దాసరి సాంబగౌడ్, నాయకులు ఉపేందర్, ఆంజనేయులుగౌడ్, సభ్యులు అంకం కైలాసం, హన్మాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ నిషేధం, మూలాల విభజన, ప్రస్తుత పర్యావరణ పరిస్థితి అనే అంశాలపై శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2003లో భాగంగా ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శంకర్, శ్రీనివాస్, సీఈఈ బృందం(ఎస్పీఎం మిల్లు) ప్రతినిధి వినల్ తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య సిబ్బంది సేవలు అభినందనీయం

కాగజ్‌నగర్‌టౌన్: పారిశుధ్య సిబ్బంది సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ అంజయ్య అన్నారు. శుక్రవారం పారిశుధ్య కార్మికుడు, డ్రైవర్ చంద్రయ్య ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆయన్ను సన్మానించారు. మున్సిపల్ కౌన్సిలర్ ఎల్లేశ్, సునీల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

### వీడ్కోలు వేడుక




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దహెగాం: మండలంలోని కుంచవెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. అనంతరం వారికి హాల్‌టికెట్లు అందజేశారు. హెచ్‌ఎం భరత్, ఎస్‌ఎంసీ చైర్మన్ దేశయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.